రంజాన్ ప్రార్థనలకు ఏర్పాట్లు పూర్తి

ఎమ్మెల్యే రాచమల్లు

ప్రొద్దుటూరు : పవిత్ర రంజాన్ పండుగ సందర్భంగా ముస్లిం మైనారిటీలు ప్రార్థనలు చేసుకునేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. స్థానిక కొర్రపాడు రోడ్డులోని ఈద్గా మైదానాన్ని శుక్రవారం ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈద్గా మైదాన అభివృద్ధి కోసం మున్సిపాలిటీ నుంచి రూ.65 లక్షలు కేటాయించామన్నారు. ఈ నిధులతో బండల చపట, ప్రహరీ, వజు చేసుకునేందుకు అనువైన ఏర్పాట్లు చేస్తున్నారన్నారు. రంజాన్ సందర్భంగా గతంలో మాదిరి షామియానాలు కాకుండా చలువ పందిళ్లు ఏర్పాటు చేసి 40 ఎయిర్ కూలర్లను తెప్పించామన్నారు. మైదానాన్ని పరిశుభ్రంగా చేయించామన్నారు. ముస్లిం నాయకులందరూ ఐక్యంగా ఈ సమస్య పరిష్కారం కోసం కృషి చేశారన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి, అంజుమన్ కమిటీ అధ్యక్షుడు బొల్లవరం బాషా, సహాయ కార్యదర్శి ఆర్టీసీ బాబా, మైనారిటీ కౌన్సిలర్లు కమాల్, జిలాన్, ఖలీల్, సత్యం 25, 26 వార్డుల ఇన్‌చార్జిలు నూరి, పాలగిరి ఖాజా, హనీఫ్, మున్సిపల్ కమిషనర్ వెంకటరమణయ్య, డీఈ ప్రభుదాసు, ఏఈ ఉమామహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



ఈద్గా అభివృద్ధి పనులపై అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

రంజాన్ తోఫా పంపిణీ

ప్రొద్దుటూరు క్రైం : పోరెడ్డి సుజాత ఫౌండేషన్ ఆధ్వర్యంలో బొల్లవరం, బుడ్డాయపల్లెలోని ముస్లింలకు శుక్రవారం రంజాన్ తోఫా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సేవా కార్యక్రమాలను ప్రొద్దుటూరు ప్రాంతమంతా విస్తరించే స్థాయికి సుజాత ఫౌండేషన్ చేరుకోవాలన్నారు. ఈ సందర్భంగా ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఫౌండేషన్ చైర్మన్ పోరెడ్డి నరసింహారెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లె లక్ష్మీదేవి, వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు కామిశెట్టి సుబ్రమణ్యం, వార్డు కౌన్సిలర్ పందిటి సరోజమ్మ తదితరులు పాల్గొన్నారు.

కష్టపడ్డవారందరికీ పదవులు

ప్రొద్దుటూరు : వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ కోసం కష్టపడి పనిచేసిన వారందరికీ పదవులు వరిస్తున్నాయని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ డైరెక్టర్‌గా నియమితుడైన సానపురెడ్డి ప్రతాప్‌రెడ్డి శుక్రవారం స్థానిక ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో ఎమ్మెల్యేను కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లో పార్టీ కోసం పనిచేసినవారందరూ గుర్తింపునకు నోచుకున్నారని..గౌరవానికి, స్థాయికి తగినట్లు పదవులను పొందుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి, పార్టీ నాయకులు మడక రాము, పట్టణ సచివాలయ కన్వీనర్ల ఇన్‌చార్జి కాకర్ల నాగేశ్వరరెడ్డి, రాజుపాళెం మండల కన్వీనర్ రాజారాం రెడ్డి, మాజీ సర్పంచ్ రమణయ్య తదితరులు పాల్గొన్నారు.



రంజాన్ తోఫా పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి

ఉచిత వైద్యశిబిరం

ప్రొద్దుటూరు కల్చరల్ : మండల పరిధిలోని గౌతమి మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం మెడికల్ క్యాంప్ నిర్వహించారు. డాక్టర్లు శంకర్ గురు అభిలాష్, దిలీప్‌కుమార్ రోగులను పరీక్షించి మందులను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఉమాకాంతం, కరస్పాండెంట్ బాబమ్మ, డైరెక్టర్లు నాగూర్, రవీంద్రారెడ్డి, హెచ్ఓడీలు ప్రకాష్‌రావు, అయ్యవారయ్య, విజయమ్మ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ విజయలక్ష్మి, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.



వైద్య పరీక్షలు చేస్తున్న దృశ్యం

పశువుల కుంటను కాపాడండి

కలసపాడు : మండలంలోని సిద్దమూర్తిపల్లె గ్రామ పొలం సర్వే నెంబర్ 171, 172, 173, 174లలో సుమారు 15 ఎకరాల భూమిని గతంలో కాశినాయన మండలం ఉప్పలూరుకి చెందిన బసిరెడ్డి పుల్లారెడ్డి, బి.పెద్దవెంకటరెడ్డి, బి.చిన్నవెంకటరెడ్డి, బి.వెంకటరెడ్డి, ముత్యాల నరసింహారెడ్డిలు పశువుల మేతకు, నీటి కోసం కేటాయించారు. ఆ భూమిని ఇటీవల మండలంలోని చెన్నారెడ్డిపల్లెకు చెందిన బండారపు వెంకటరాజు మరికొంతమంది ఆక్రమించి ఇటీవల ఆన్‌లైన్‌లో పేర్లు ఎక్కించుకుని, గురువారం పొలంలో దుక్కి దున్నుతుండగా ఉప్పలూరుకు గ్రామస్తులు అడ్డుపడ్డారు. ఈ విషయమై అధికారులకు ఫిర్యాదు చేశారు.

క్లుప్తంగా

పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలి

బద్వేలు అర్బన్ : ప్రతి ఒక్కరూ విరివిగా మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని రాచపూడి నాగభూషణం డిగ్రీ, పీజీ కళాశాల ఏఓ, మున్సిపల్ వైస్ చైర్మన్ ఆర్.వి.సాయిక్రిష్ణ పేర్కొన్నారు. ప్రపంచ ధరిత్రి వారోత్సవాల్లో భాగంగా ఎన్‌సీసీ బెటాలియన్ ఆదేశాల మేరకు కళాశాల ఎన్‌సీసీ ఎయిర్‌వింగ్ కేడెట్స్ ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు.

సీజ్ చేసిన వాహనాలకు 24న వేలం

మైదుకూరు : మైదుకూరు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్ పరిధిలో వివిధ కేసుల్లో సీజ్ చేసిన వాహనాలను ఈనెల 24న వేలం వేయనున్నట్లు కడప ఎన్‌ఫోర్స్‌మెంట్ బి.శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. బద్వేలు ఎంవీఐ నిర్ణయించిన ధరతో వేలం మొదలవుతుందన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

చాపాడు : అల్లాడుపల్లె వీరభద్రస్వామి దేవస్థాన ధర్మకర్తల పాలక మండలి నియామకానికి ఈ నెల 20న ఉత్తర్వులు వెలువడినట్లు ఆలయ ఈఓ శ్రీనివాసులు తెలిపారు. ఈ క్రమంలో ఆసక్తి కలిగిన వీరభద్రస్వామి దేవస్థాన భక్తులు పాలక మండలి సభ్యుల నియామకానికి 20 రోజులలో దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. పూర్తి వివరాలకు ఆలయ కార్యాలయంలో లేదా దేవధాయశాఖ సిబ్బందిని సంప్రదించాలని ఈఓ తెలిపారు.

ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలి

బద్వేలు : సచివాలయ సిబ్బంది చిత్తశుద్ధితో విధులు నిర్వహించి ప్రజలకు మేలు చేయాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి రాష్ట్ర సలహాదారు నాగార్జునరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఆయన పోరుమామిళ్ల మండలంలోని నాగలకుంట్ల, కొర్రపాటిపల్లె, అక్కలరెడ్డిపల్లె, కవలకుంట్ల, తిమ్మారెడ్డిపల్లె, టేకూరుపేట, చిన్నయర్రశాల, రజాసాహెబ్‌పేట, దమ్మనపల్లె సచివాలయాలను ఆయన తనిఖీ చేశారు. సిబ్బంది హాజరును పరిశీలించారు.

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు అర్బన్ ప్రాజెక్టు పరిధిలోని జిన్నా రోడ్డులోని ప్రీ స్కూల్ అంగన్‌వాడీ కేంద్రాన్ని శుక్రవారం స్త్రీ శిశు సంక్షేమ శాఖ జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ ఎంఎన్ రాణి పరిశీలించారు. రికార్డులను తనిఖీ చేసి వివరాలను అడిగి తెలుసుకున్నారు. హాజరుపట్టీలో సంఖ్య ఎక్కువగా ఉంది, ఇక్కడ మాత్రం పిల్లలు తక్కువగా ఎందుకున్నారని పీడీ అడగడటంతో..రంజాన్ పండుగ కావడంతో పిల్లలు రాలేదని అంగన్‌వాడీ కార్యకర్తలు తెలిపారు.

అగ్రికల్చర్ అసిస్టెంట్లకు సన్మానం

దువ్వూరు : స్థానిక రైతు భరోసా కేంద్రంలో శుక్రవారం మండల వ్యవసాయ సలహాకమిటీ చైర్మన్ చాగంరెడ్డి వీరనారాయణరెడ్డి ఆధ్వర్యంలో విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లను సన్మానించారు. కానగూడూరు, చిన్నసింగనపల్లె, కృష్ణంపల్లె విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లు రాజేష్, గంగాఈశ్వరి, శివతేజలను ఘనంగా సన్మానించారు.

క్రమశిక్షణతో విద్యనభ్యసించాలి



శశిధర్‌ను సత్కరిస్తున్న కళాశాల యాజమాన్యం

ప్రొద్దుటూరు కల్చరల్ : విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకోవాలని అనంతపురం జేఎన్‌టీయూ రిజిస్ట్రార్ శశిధర్ పేర్కొన్నారు. మండల పరిధిలోని సాయిరాజేశ్వరి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం సాయంత్రం వార్షికోత్సవ వేడుకలను నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ఇంజినీరింగ్‌లో పట్టు సాధించి నూతన ఆవిష్కరణలు చేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ బసిరెడ్డి రాజేశ్వరరెడ్డి, కరస్పాండెంట్ వీరకళ్యాణ్‌రెడ్డి, ప్రిన్సిపాల్ పాండురంగన్ రవి, వైస్ ప్రెసిడెంట్ వీరకుమార్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరెడ్డి, హెచ్ఓడీలు, అధ్యాపకులు పాల్గొన్నారు.

మంచి పాలన అందిస్తున్న

సీఎంను ఆశీర్వదించండి

గడప గడపకు కార్యక్రమంలో ఎమ్మెల్యే డా. సుధ

గోపవరం : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా అన్నివర్గాల ప్రజలకు లబ్ధి చేకూరుతుందని ఎమ్మెల్యే డాక్టర్ సుధ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని రాచాయపేట సచివాలయం పరిధిలోని బెడుసుపల్లె, చెన్నవరం, వడ్డె అగ్రహారం గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికి వెళ్లి నాలుగేళ్ల పాలనలో ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాల ద్వారా కుటుంబానికి ఏ మేరకు లబ్ధి చేకూరిందో ప్రజలకు వివరించారు. అలాగే ఇంకా అర్హత ఉండి సంక్షేమ పథకాలు అందని వారి వివరాలను అడిగి తెలుసుకున్నారు. మరో ఏడాది పాలనలో అందించే సంక్షేమ పథకాల ద్వారా మరింత లబ్ధి చేకూరుతుందని ఆమె తెలిపారు. ప్రజా సమస్యలను తెలుసుకునేందుకే అన్నిశాఖల అధికారులతో గడప గడపకు వస్తున్నట్లు పేర్కొన్నారు. ఎలాంటి సమస్యలు ఉన్నా గ్రామ సచివాలయానికి వెళ్లి పరిష్కరించుకోవాలని ప్రజలకు సూచించారు. ఇంత మంచి పరిపాలన అందిస్తున్న జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించి మరోసారి ముఖ్యమంత్రిగా చేసుకోవాల్సిన అవసరం ఉందని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

తాగునీటి సమస్యను పరిష్కరించండి

చెన్నవరం ఎస్సీ కాలనీ, బెడుసుపల్లె ఎస్సీ కాలనీలలో తాగునీటి సమస్య ఉందని స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. వేసవికాలం కావడంతో తాగునీటికి అవస్థలు పడుతున్నామని మహిళలు ఎమ్మెల్యే ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. స్పందించిన ఎమ్మెల్యే సంబంధిత అధికారులతో మాట్లాడి వీలైనంత త్వరగా సమస్యను పరిష్కరించాలన్నారు. వేసవిలో తాగునీటి సమస్య రాకుండా ముందస్తు ప్రణాళిక ఎందుకు చేపట్టలేదని అధికారులను ప్రశ్నించారు. ఇక మీదట ఇలాంటి సమస్య ఉత్పన్నం కాకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ హరినారాయణ, మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ గోపవరం మల్లికార్జునరెడ్డి, సచివాలయ కన్వీనర్ పుల్లయ్య, సర్పంచ్ నాగేంద్ర, మాజీ ఎంపీటీసీ సాంబశివారెడ్డి, పార్టీ నాయకులు రవిచంద్రారెడ్డి, శివారెడ్డి, హరికృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధ

వృద్ధులకు చీరల పంపిణీ

బద్వేలు అర్బన్ : రంజాన్ పండుగను పురస్కరించుకుని నేచర్ కన్జర్వేషన్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం 17వ వార్డులోని శ్రీకృష్ణదేవరాయ నగర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని వృద్ధులకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ సత్యం, మాలమహానేన రాష్ట్ర కార్యదర్శి మీసాల రవి, మునెయ్య, నేచర్ కన్జర్వేషన్ సర్వీస్ సొసైటీ ప్రెసిడెంట్ గాస్‌పీర్ పాల్గొన్నారు.

బాగా చదువుకోవాలి

ప్రతి విద్యార్థి బాగా చదువుకుని ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు మంచిపేరు తీసుకురావాలని ఎమ్మెల్యే విద్యార్థులకు తెలియజేశారు. జగనన్న గోరుముద్దపై విద్యార్థుల వద్ద ఆరా తీశారు.

అక్టోబర్‌నాటికి పూర్తి చేయాలి

పీహెచ్‌సీ నిర్మాణంపై ఎమ్మెల్యే శెట్టిపల్లె

చాపాడు : మండలంలోని నక్కలదిన్నెలో నిర్మించనున్న రెండో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని అక్టోబరు నాటికి పూర్తి చేయాలని ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి తెలిపారు. రూ.2.50 కోట్లతో నూతనంగా మంజూరైన పీహెచ్‌సీ నిర్మాణం కోసం నక్కలదిన్నెలో కేటాయించిన 1.12 ఎకరాల స్థలాన్ని శుక్రవారం ఆర్ అండ్ బీ ఎస్ఈ మహేశ్వర్‌రెడ్డి, సంబంధిత కాంట్రాక్టర్లతో కలసి ఎమ్మెల్యే పరిశీలించారు. ఆసుపత్రి నిర్మాణానికి సంబంధించిన నమూనాను పరిశీలించి మౌలిక వసతులు ఇతర వాటిపై చర్చించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంత ప్రజలతో తమ గ్రామాలకు సమీపంలో మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం ప్రతి మండలంలో రెండు పీహెచ్‌సీలను ఏర్పాటు చేస్తోందన్నారు. ఈ క్రమంలో నక్కలదిన్నెలో 4805 చదరపు అడుగుల్లో ఆసుపత్రి భవనాలు నిర్మిస్తున్నారన్నారు. మేలో పనులు మొదలుపెట్టి అక్టోబరు నాటికి పూర్తి చేయాలన్నారు. ఆసుపత్రి నిర్మాణం కోసం విద్యుత్ సదుపాయాన్ని వెంటనే ఏర్పాటు చేయాలని ట్రాన్స్ కో ఏఈ రవిశంకర్‌కు సూచించారు. అనంతరం నక్కలదిన్నెలో ఏర్పాటు చేసిన తాత్కాలిక పీహెచ్‌సీని ఆయన పరిశీలించి ఆసుపత్రిలో సౌకర్యాలు, పర్నీచర్, సిబ్బంది కొరతపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సిబ్బంది ఆయనను సన్మానించారు.



పీహెచ్‌సీ నిర్మాణంపై ఉన్నతాధికారులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

గోడౌన్ నిర్మాణానికి స్థల పరిశీలన

అనంతరం నక్కలదిన్నె గ్రామ సచివాలయ పరిధిలో ప్రభుత్వం నిర్మించనున్న గోడౌన్ నిర్మాణం కోసం ఎమ్మెల్యే స్థలాన్ని పరిశీలించారు. గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు సోమల మహేశ్వరరెడ్డి 50 సెంట్ల స్థలాన్ని ప్రభుత్వానికి విరాళంగా ఇవ్వడంతో ఆ స్థలంలో గోడౌన్ నిర్మాణంను త్వరలోనే మొదలుపెట్టాలని ఎమ్మెల్యే సూచించారు.

బ్రహ్మంగారి మాలధారులకు సౌకర్యాలు కల్పించండి

బ్రహ్మంగారిమఠం : శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి మాల ధరించిన భక్తులకు సౌకర్యాలు కల్పించాలని మఠం పూర్వపు మఠాధిపతి శ్రీ వీరభోగ వసంత వెంకటేశ్వరస్వామి పెద్ద కుమారుడు శ్రీ వెంకటాద్రిస్వామి కోరారు. ఈ మేరకు ఆయన మఠం ఫిట్‌పర్సన్ సి.శంకర్‌బాలాజిని దేవస్థానంలో గురువారం రాత్రి కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ విషయాన్ని శుక్రవారం విలేకరులకు తెలిపారు. ఈ నెల 27 నుంచి జరగనున్న వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన గురుపూజోత్సవాలకు మాలధారులు ఇరుముడి సమర్పించేందుకు పెద్ద ఎత్తున వస్తారని ఆయన పేర్కొన్నారు. వారికి కావాల్సిన అన్ని ఏర్పాట్లను చేయాల్సిందిగా తెలియజేశారు.

నిర్మాణాల బాధ్యత సచివాలయ సిబ్బందిదే

బద్వేలు : పక్కాగృహాలను ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాల ప్రకారం పూర్తి చేయించాల్సిన బాధ్యత సచివాలయ సిబ్బందిదేనని పోరుమామిళ్ల మండల ప్రత్యేకాధికారి డాక్టర్ చంద్రశేఖర్ పేర్కొన్నారు. శుక్రవారం పోరుమామిళ్ల పట్టణ పరిధి సచివాలయం- 2లో నిర్మాణాలు మధ్యలో నిలిపేసిన లబ్ధిదారులతో తహసీల్దార్ విజయకుమారి, ఈఓపీఆర్డీ భాస్కర్‌బాబుతో సమావేశం నిర్వహించారు. ప్రతి లబ్ధిదారుడితో ప్రత్యేకంగా మాట్లాడి నిర్మాణం నిలిపేసిన కారణాన్ని అడిగి తెలుసుకున్నారు. సచివాలయ సిబ్బంది, వలంటీర్లు జట్లుగా ఏర్పడి లబ్ధిదారులను సమాయత్తం చేసి నిర్మాణాలు ఆగకుండా చూడాలన్నారు.

పవిత్ర 'వెలుగు'

ప్రొద్దుటూరు కల్చరల్ : పవిత్ర రంజాన్ పండుగ (ఈదుల్ ఫితర్)ను ముస్లింలు శనివారం జరుపుకోనున్నారు. ఈ సందర్భంగా పట్టణంలోని పలు ప్రాంతాల్లోని మసీదులను విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. కొర్రపాడు రోడ్డులోని ఈద్గావద్ద ప్రత్యేక ఏర్పాటు చేశారు.



విద్యుత్ దీపాలంకరణలో జామియా మసీదు